మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్

చట్టాలపై అవగాహన ఉండాలి

సదాశివపేట, మార్చి 4: విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ అన్నారు. మంగళవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర ఆదేశాలతో పట్టణంలోని జ్యోతిబా పూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ క్రమశిక్షణగా ఉండాలని, పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు న్యాయపరమైన విషయాల్లో ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. న్యాయ సహాయం కావాలంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. అనంతరం హాస్టల్‌లో ఆహార నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ ఎసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్, ఎస్ఐ కృష్ణయ్య, ప్రిన్సిపాల్ లావణ్య రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పురాతన ఆలయాలకు పూర్వవైభవం తీసుకురావాలి

గుమ్మడిదల,మార్చి4: పురాతన ఆలయాలకు పూర్వ వైభవం తీసుకురావాలని రాంపూర్ క్షేత్రం పీఠాధిపతి గురు మాధవానంద సరస్వతి సూచించారు. మంగళవారం మండలంలోని అనంతారంలో పురాతన ఆలయమైన వీరభద్రస్వామి, శివాలయాలను మాధవానంద సరస్వతి సందర్శించారు. ఈ సందర్భంగా వేదపండితులు రామశర్మ బృందం, గ్రామస్తులు మాధవానంద సరస్వతికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామిజీ వీరభద్రస్వామి వారికి, శివుడికి, హనుమంతుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పురాతన ఆలయమైన వీరభద్రస్వామి ఆలయాన్ని పునఃనిర్మించడానికి గ్రామస్తులు మాధవానందసరస్వతి ద్వారా పలు సలహాలు స్వీకరించారు. పురాతన ఆలయమైన వీరభద్రస్వామికి నిత్యపూజలు నిర్వహించాలని సూచించారు. శైవ క్షేత్రానికి పూర్వ వైభవం తీసుకురావడానికి ముందుకొచ్చిన గ్రామస్తులను అభినందించారు.

అనంతారం వీరభద్రస్వామి ఆలయంలో పూజలు చేసిన అనంతరం భక్తులకు సూచనలు చేస్తున్న మాధవానంద సరస్వతి

ఆయిల్ పామ్‌తో అధిక లాభాలు

మనూరు, మార్చి 4: ఆయిల్‌పామ్‌తో రైతులు అధిక లాభాలు పొందవచ్చునని ఉద్యానవన అధికారిని మౌనికారెడ్డి అన్నారు. మంగళవారం మనూరు మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సంవత్సరం జిల్లాలో 3వేల ఎకరాల ఆయిల్‌పామ్ సాగు లక్ష్యంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. సంగారెడ్డి జిల్లాకు గోద్రేజ్ ఆగ్రో వెట్ సంస్థకు బాధ్యతలు అప్పగించారని తెలిపారు. ఎకరానికి 57మొక్కల చొప్పున 90శాతం రాయితీపై అందిస్తూ మొదటి నాలుగేండ్లకు మొక్కల పెంపకం కోసం ఎకరానికి రూ.4200 అందిస్తామన్నారు. దీంతోపాటు డ్రిప్ ఇరిగేషన్‌లను కూడా ప్రభుత్వం నిర్ణయించిన ధరకు రాయితీతో అందించనుందని అన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించే ఆస్కారం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు సంగమేశ్వర్, వెంకటేశకం, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం తండ్లాట

జహీరాబాద్, మార్చి 4: తాగునీటి కోసం ప్రజలు తండ్లాడుతున్నారు. ప్రజలకు తాగునీటి సరఫరా చేసే రక్షిత మంచినీటి పథకాలు కాలిపోయి నెలలు గడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. బిందెడు నీళ్ల కోసం అవస్థలు పడుతున్నా పట్టించుకునే నాథుడే లేడని గ్రామస్తులు వాపోతున్నారు. న్యాల్‌కల్ మండలంలోని రేజింతల్‌లో నెలకొన్న తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలోని ఎస్సీ, మైనార్టీ కాలనీలతో పాటు 3, 6 వార్డుల్లో సింగిల్‌ఫేజ్ మోటర్లు కాలిపోయి నెలలు గడుస్తున్నా మర్మతులకు నోచుకోవడం లేదు. అసలే వేసవి కావడంతో దప్పిక తీర్చుకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. దీనికితోడు మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని కాలిపోయిన సింగిల్ ఫేజ్ మోటర్లకు మరమ్మతులు చేసి తాగునీటి ఇబ్బందులు తొలిగించాలని కోరుతున్నారు.

తాగునీటి కోసం ఎదురుచూస్తున్న మహిళలు

హత్య కేసును ఛేదించిన పోలీసులు

గుమ్మడిదల, మార్చి4: మహిళా హత్య కేసును పోలీసులు ఛేదించి నేరస్తుడిని పట్టుకున్నారు. జిన్నారం సీఐ నయూమొద్దీన్, ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం కన్నారం శేరితండాకు చెందిన కేతావత్ మునీని డిసెంబర్ 28న నర్సాపూర్ మండలం బిక్య గ్రామం(నంద్యాతండా)కు చెందిన గుగులోత్ పూర్య మాయమాటలు చెప్పి గుమ్మడిదల కల్లు దుకాణంలో కల్లు తాగారు. అనంతరం నల్లవల్లి అటవీప్రాంతానికి మున్నీని తీసుకెళ్లి లైంగికదాడి చేసి చున్నీతో ఆమె గొంతుకు చుట్టి ఊపిరాడకుండా చేసి హత్య చేశాడు. మృతురాలు భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ద్వారా గుర్తించి హత్య చేసిన నేరస్తుడు గుగులోత్ పూర్యను చాకచక్యంగా పట్టుకుని విచారించారు. హత్య చేసినట్లు గుగులోత్ పూర్య అంగీకరించడంతో నేరంలో వాడిన టీవీఎస్ ఎక్సల్ మోటర్‌సైకిల్, సెల్‌ఫోన్ సీజ్ చేసి నేరస్తుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ, ఎస్సై వెల్లడించారు. కేసును ఛేదించిన ఎస్సై మహేశ్వర్‌రెడ్డిని, హెడ్‌కానిస్టిబుల్ వెంకటేశం, కానిస్టిబుల్ సికిందర్, కిశోర్, సాయి వదర్ధన్‌రెడ్డిలను సీఐ అభినందించారు.

వివరాలు వెల్లడించిన సీఐ నయూమొద్దీన్, ఎస్సై మహేశ్వర్‌రెడ్డి



రోటరీ క్లబ్ సదాశివపేట నూతన కార్యవర్గ సభ్యులు

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

సదాశివపేట, మార్చి 4:రోటరీ క్లబ్ సదాశివపేట కార్యవర్గాన్ని సరస్వతి శిశు మందిర్ పాఠశాల ప్రాంగణంలో మంగళవారం ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రోటరీ క్లబ్ మొయినాబాద్ ప్రధాన కార్యదర్శి డింపుల్ అగర్వాల్, అధ్యక్షుడు చిరంజీవ్ సలూజా, డిస్ట్రిక్ గవర్నర్ ఉదయ్ పిలానీ, రామ్‌ప్రసాద్, శరత్ చౌదరి, రాజశేఖర్ హాజరయ్యారు. రోటరీ క్లబ్ సదాశివపేట అధ్యక్షుడిగా ప్రభు, ప్రధానకార్యదర్శిగా అశోక్‌కుమార్, జాయింట్ సెక్రెటరీగా ప్రవీణ్‌కుమార్, మెంబర్‌షిప్‌చైర్‌గా చీల మల్లన్న, ఫౌండేషన్ చైర్‌గా వినోద్‌కుమార్, సర్వీస్ ప్రాజెక్ట్‌గా చంద్రశేఖర్, సభ్యులుగా రాజాకుమారి ముద్ర, పురం రజిని, శరత్‌చంద్ర, అన్నపూర్ణ, రాజు, నరేందర్, నాగరాజు, మాలతి లత, రామకృష్ణ, కృపాకర్, రామకృష్ణరెడ్డి, రాచన్న ఎన్నికయ్యారు. అనంతరం క్లబ్ మొయినాబాద్ ప్రధాన కార్యదర్శి డింపుల్ అగర్వాల్ మాట్లాడుతూ శిశు మందిర్ పాఠశాలలో రూ.3లక్షలతో నూతనంగా మరుగుదొడ్లు నిర్మించామన్నారు. సమాజసేవే లక్ష్యంగా రోటరీ క్లబ్‌లు పని చేస్తాయన్నారు. భవిష్యత్తులో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

లో వోల్టేజీతో ఎండుతున్న పంటలు

- కాలిపోతున్న మోటర్లు
- యాసంగికి సాగు నీరందక రైతన్న విలవిల
- సింగూరు కెనాల్ కాలువ కింద ఎడారిలా మారిన పొలాలు
- సీసీ లైనింగ్ పేరుతో కాలాయాపన
- మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక చొరవ చూపించాలి

భూగర్భజలాలు అడుగంటిపోవడంతో ఎండిన పొలాలు

పుల్కల్, మార్చి 4: ఉమ్మడి పుల్కల్ మండలంలో బోర్లను నమ్ముకొని నాట్లు వేసిన రైతులు తలలు పట్టుకుంటున్నారు. లోవోల్టేజీతో మోటర్లు కాలిపోతుండడంతో సాగు నీరందక రైతులు విలవిలలాడుతున్నారు. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో పంటలు ఎండిపోయి ఎడారిలా కనబడుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయాన్ని పండుగలా చేసుకున్న రైతులు నేడు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. సింగూరు ఎడమ కాల్వాల ద్వారా 44వేల ఎకరాలకు సాగు నీరందిస్తే, నేడు సీసీ లైనింగ్ పేరుతో యాసంగికి నీరు వదలక కాలయాపన చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదేండ్లుగా ఎన్నడూ ఈ దుస్థితి రాలేదని రైతులు వాపోతున్నారు. ఉమ్మడి పుల్కల్ మండలంలో 20 వేల ఎకరాలకు మించి నాట్లు వేసే రైతులు, నేడు 16 వేల ఎకరాల్లోపే సాగు చేశారు. సింగూరు అంటేనే పచ్చని పంటలకు పెట్టింది పేరు, కానీ, అందుకు విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన సాగిస్తుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లోవోల్టేజీతో మోటర్లన్నీ కాలిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతున్నారు. అందోల్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక చొరవ చూపించి సింగూరు కాల్వల సీసీ లైనింగ్ పనులు త్వరగతిన పూర్తయ్యేలా చొరవ చూపించాలని రైతులు కోరుతున్నారు.

నీరందక బోర్లు వేస్తున్న రైతులు

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- జిల్లాలో 54 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- పరీక్షలు రాయనున్న 34,614 మంది విద్యార్థులు
- సీసీ కెమెరా నిఘాలో జరగనున్న పరీక్షలు

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 4: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలు జరగనుండగా, ఉదయం 8.30 గంటలకు విద్యార్థులు తమ పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. 8.45కు ఓఎమ్ఆర్ ఇవ్వనున్నందున విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. ఈ ఏడాది 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చినా పరీక్షా కేంద్రంలోకి అనుతిస్తారని సంబంధిత అధికారులు స్పష్టం చేశారు. జిల్లాలో మొత్తం 54 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేం ద్రాల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించడంతోపాటు పూర్తి స్థాయి లో సిబ్బందిని నియమించారు. ఒక హైపవర్ కమిటీతోపాటు, డీఈసీ కమిటీ, 4 సిట్టింగ్ స్క్వాడ్, 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్షలను పర్యవేక్షించనున్నాయి. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పరీక్షలను సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. ఎక్కడా అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు చేపట్టారు. 54 పరీక్షా కేంద్రాల్లో 34,614 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో మొదటి సంవత్సరానికి సంబంధించి 16,513 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా, జనరల్ కేటగిరీలో 15, 298 మంది, వొకేషనల్ కేటగిరీలో 1215 మంది విద్యార్థులు ఉన్నారు. ద్వితీయ సం వత్సరంలో 18,101 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా, జనరల్ కేటగిరీలో 16, 483 మంది, వొకేషనల్ కేటగిరీలో 1618 మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లతోపాటు చేతి గడియారాలను కూడా అనుమతి లేదని అధికారులు స్పష్టం చేశారు. ప్రశాంత వాతావరణంలో ఇంటర్మీడియట్ పరీక్షలు జరిగేలా విద్యాశాఖ చర్యలు తీసుకొంది.

చెరువులో స్నానానికెళ్లి ఇద్దరు మృతి

జహీరాబాద్, మార్చి 4: చెరువులో స్నానానికెళ్లి ఇద్దరు మృతి చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని గంగ్వార్ గ్రామ సమీపంలోని చెరువు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. హద్నూర్ పోలీసుల కథనం ప్రకారం..మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన ఫైజల్(18), సంజయ్ కాంబ్లే (43)బంధువులతో కలిసి దైవదర్శనం కోసం మండలంలోని మెటల్‌కుంట గ్రామ చౌరస్తా సమీపంలోని ముల్తానీబాబా దర్గా ఉత్సవాలకు హాజరయ్యారు. దర్శనానికి వెళ్లేముందు కుటుంబ సభ్యులంతా దర్గా సమీపంలోని చెరువు వద్దకు వెళ్లారు. చెరువులో స్నానం చేసేందుకు ఫైజల్ వెళ్లగా, అక్కడ గుంతలో పడిపోవడంతో రక్షించాలని కేకలు వేశాడు. వెంటనే అక్కడే ఉన్న సంజయ్ కాంబ్లే నీటిలో మునిగిపోతున్న ఫైజల్‌ను రక్షించేందుకు వెళ్లి మునిగిపోయాడు. అక్కడే ఉన్న ఫైజల్ తండ్రి రహిమతుల్లా వారిని రక్షించేందుకు వెళ్లి చెరువులో పడిపో యి ప్రాణాలతో బయట పడ్డాడు. అప్పటికే చెరువులోని గుంతలో పడిన ఫైజల్, సంజయ్ కాంబ్లే ఇద్దరు మృతి చెందారు. విషయం తెలుసుకున్న జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు, హద్నూర్ ఎస్ఐ రాజశేఖర్ ఘటనా స్థలానికి సిబ్బందితో చేరుకున్నారు. మృతి చెందిన సంజయ్‌కాంబ్లే మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. రాత్రి కావడంతో ఫైజల్ మృతదేహం కోసం చెరువులో గాలించినా లభించలేదు. దర్గా దర్శనానికి వచ్చి మృతి చెందడంపై మృతుల కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హద్నూర్ పోలీసులు పేర్కొన్నారు.

రామచంద్రాపురం, మార్చి4: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు సుమంగళి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంత గొప్పదో స్వయం పరిపాలన దినోత్సవంతో విద్యార్థులకు తెలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హిమ, సిద్ధేశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అందోల్, మార్చి4: జోగిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఒక్కరోజు ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు చక్కగా పాఠాలు బోధించి ఆకట్టుకొన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినంధించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నరేశ్‌కుమార్, ఉపాధ్యాయులు మాణయ్య, నరోత్తం, త్రినాథ్‌రావు, రాములు, మంజ్యానాయక్, అనిల్, చంద్రశేఖర్, నిరీక్షణ, మంజుల, అమృత పాల్గొన్నారు.

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 4: పదేండ్లపాటు విద్యాబుద్ధులు నేర్చుకొని పాఠశాలను వీడుతున్న పదోతరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. మంగళవారం మండలంలోని కల్పగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలకడంతోపాటు వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్ మాట్లాడుతూ పదోతరగతిలో మెరుగైన ఫలితాలు సాధించి పాఠశాల, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మాజీ ఉప సర్పంచ్ అజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

28వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

గుమ్మడిదలలో రిలే నిరాహారదీక్షకు సంఘీభావం తెలుపుతున్న రైతు జేఏసీ నాయకులు

గుమ్మడిదల, మార్చి 4: డంపింగ్ యార్డు అనుమతులను ప్రభుత్వం రద్దు చేయాలంటూ రిలే నిరాహార దీక్షలో బాధిత గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు. రాంకీ సంస్థ ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డు నిర్మాణ పనులను వెంటనే నిలుపుదల చేసి ఇక్కడి ప్రజలకు ఉపశమనం కల్పించాలంటూ నల్లవల్లి, కొత్తపల్లి, గుమ్మడిదల గ్రామాల్లో రిలే నిరాహారదీక్షలు చేస్తున్న వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం, నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్యారానగర్‌గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో రాంకీ సంస్థ ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా 28వ రోజు రిలే నిరాహార దీక్షలో నల్లవల్లి ఆటో యూనియన్ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు, కొత్తపల్లిలో గ్రామ యువకులు, గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1989 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. వీరికి గుమ్మడిదల రైతు జేఏసీ కమిటీ అధ్యక్షుడు చిమ్ముల జైపాల్‌రెడ్డి, జేఏసీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షుడు మాట్లాడుతూ 28 రోజులుగా వివిధ రూపాల్లో డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా ఆందోళనలు, నిరసనలు చేస్తున్నా ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం ఆవేదన కలిగిస్తుందన్నారు. ప్రజాపాలన సాగిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొంటున్నప్పటికి ప్రజల సమస్యలు, బాధలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పని బాటలు మానేసి నిత్యం డంపింగ్ యార్డు అనుమతులు రద్దు చేయాలని నిరసనలు చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైనది కాదన్నారు. వెంటనే ప్రభుత్వం చొరవ చూపి డంపింగ్ యార్డును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, పుట్ట నర్సింగ్‌రావు, రైతు జాతీయ సమాఖ్య సభ్యుడు మంద బలరాం రెడ్డి, మంద భాస్కర్‌రెడ్డి, ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చిమ్ముల నర్సింహారెడ్డి, సదానందరెడ్డి, తులసిదాసు, కరుణాకర్, రాంరెడ్డి, ముద్దంగుల గోపాల్, పోచుగారి మోహన్‌రెడ్డి, కాలకంటి రవీందర్‌రెడ్డి, నర్సింహులు, అశోక్ గౌడ్, బొడ్డు మ ల్లేశ్, అమృత్‌ఖాన్, శ్రావణ్, ఆనంద్ గౌడ్, కుమ్మరి ఆంజనేయులు, రామకృష్ణ, కొత్త పల్లి మల్లేశ్‌గౌడ్, సురేశ్ పాల్గొన్నారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

అమీన్‌పూర్ మార్చి 4: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది ఎస్ఐ దుర్గయ్య కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి..మున్సిపాలిటీ పరిధిలోని ఆర్టీసీ కాలనీకి చెందిన ఎన్నిరెడ్డి శ్రీనివాసరెడ్డి (34) సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేశాడు. అతడికి భార్య వాసవి, కుమారుడు ఉన్నారు. భార్య రెండో కాన్పు కోసం పుట్టింటికి వెళ్లిన అనంతరం శ్రీనివాసరెడ్డి ఒక్కడే ఇంట్లో ఉంటున్నాడు. కొంతకాలంగా ఆర్థిక కారణాలతో ఇబ్బందులు పడుతూ ఎక్కువ మొత్తంలో అప్పులు కావడంతో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఇంట్లో ఉరివేసుకొని చనిపోయాడు. మరదలు సాయిచందన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జిన్నారం మార్చి 4: గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని చెట్లపోతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కలెక్టర్, డీఈవో, ఎంఈవో పాత్రల్లో పలువురు విద్యార్థులు రాణించారు. అనంతరం పాఠశాల హెచ్ఎం మాట్లాడుతూ...విద్యార్థుల్లో దాగి ఉన్న బోధనా నైపుణ్యాలను ప్రదర్శించేందుకు స్వయంపాలన దినోత్సవం చక్కటి వేదికగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయుల దిశానిర్దేశంతోనే నవ సమాజ స్థాపన తరగతి గదిలోనే నిర్మితమవుతుందన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుభాస్కర్, వేణు, జగదీశ్, కాశీనాథ్, శేఖర్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ

కంది, మార్చి 4: ఉన్నత భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్ ఫర్ ఉమెన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేశారు. మంగళవారం కంది మండల పరిధిలోని వడ్డెనడూడ తండా, కంది తండా, ఎర్థనూర్ తండా, ఇప్పటగడ్డ తండాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పర్యటించి విద్యార్థులకు జ్ఞాపక శక్తి, మంచిచెడు స్పర్శ, వ్యక్తిగత భద్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థుల వయస్సుకు తగ్గ బరువు, ఎత్తును పరిశీలించి పోషకాహారం తీసుకునేలా అవగాహన పెంచారు. వృద్ధులకు అటల్ పెన్షన్ యోజన పథకంపై అవగాహన కల్పించారు. చిరు వ్యాపారాలు చేసుకునేందుకు సహాయ సహకారాలు అందిస్తున్నారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పరీక్షా సామగ్రి...

జిన్నారం మార్చి 4: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు సంఘ సేవకుడు మహేశ్ యువసేన అధ్యక్షుడు పచ్చాటి మహేశ్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ...నిరుపేద విద్యార్థులకు ఎల్లప్పుడు అండగా ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో యువసేన సభ్యులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగల్‌గిద్ద, మార్చి 4: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించినప్పుడే గుర్తింపు లభిస్తుందని ప్రధానోపాధ్యాయుడు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కరస్‌గుత్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా సంగీత, జిల్లా విద్యా ధికారిగా గణేశ్, మండల విద్యాధికారిగా శివకూమార్, ప్రధానోపాధ్యాయురాలిగా శిమ్రాన్, ఉపాధ్యాయులుగా సుశాంత్, వర్షా, దీపికా వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 4: తెలంగాణ గిరిజన సంక్షేమ న్యాయ కళాశాలలో పని చేసేందుకు పార్ట్‌టైమ్ లెక్చరర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నటు కళాశాల ప్రిన్సిపాల్ కేపీ నిరీక్షణరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ లా కోర్సులో వివిధ సబ్జెక్టులను బోధించేందుకు సంబంధిత సబ్జెక్టులో 55శాతం మార్కులకు తగ్గకుండా పీజీ పూర్తి చేసి ఉండాలన్నారు. సెట్, నెట్, పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. సైకాలజీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ లా, కానిస్టిట్యూషన్ లా, ట్యాక్సేషన్ సబ్జెక్టుల్లో పీరియడ్ పద్ధతిలో బోధించాల్సి ఉంటుందన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నిర్ణయం మేరకు వేతనం ఉంటుందని,, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల7 లోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7330815256, 8074582331 నెంబర్లపై సంప్రదించాలన్నారు.

ఆలయంలో నవజాత శిశువు

జిన్నారం మార్చి 4: ఆలయంలో నవజాత శిశువు లభ్యమైన ఘటన బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని వైఎస్సార్ కాలనీ పూరి జగన్నాథ్ ఆలయంలో మంగళవారం జరిగింది. స్థానికులు, సీఐ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక జగన్నాథ్ ఆలయంలో నె